

# తొందరపాటు

శ్రీమతి నోశేయపల్లి కమలారాంజీ

"ఒక్కసారి అంతరంగాలు సీరియల్ పెట్టండి."

"అంతరంగాలు లేదు. ఏం లేదు. మంచి క్రికెట్ మ్యాచ్ వస్తోంది. వెస్టిండీస్-పాకిస్తాన్ మ్యాచ్. నువ్వు కూడా వచ్చి కూర్చుని చూడు...లేకపోతే లోపలికి వెళ్లి ఏ పుస్తకమో చదువుకో."

సునీతకి వళ్లు మండిపోయింది.

"ఒక్క అయిదు నిమిషాలు పెట్టండి. అయిదు నిమిషాలు ఇది, అయిదు నిముషాలు అది పెడ్తూ వుంటే...యిద్దరికీ బాగుంటుంది."

"ఊహూ. లాభం లేదోయ్. అయిదు నిముషాలు మిస్సయినా కొంప మునిగిపోతుంది."

"అయిదు నిము షాల్లో ఏం కొంపలు మునిగిపోతాయి?"

"ఆ అయిదు నిముషాల్లోనే ఫోర్ లు, సిక్స్ లు కొట్ట డమో, లేక పోతే వికెట్ పడిపోవ డమో... ఏదన్నా జరిగితే?"

"స్కోర్ బోర్డ్ చూస్తే తెలిసిపోతుంది కదా!"

"నువ్వు కూడా ఆ సీరియల్ ఏమయిందో ఎదురింటి ఆవిడ్ని అడిగితే తెల్సిపోతుంది కదా!"

"అవున్లెండి. ఇది మగాళ్ల సామ్రాజ్యం. ఎంత స్త్రీ సమానత్వం కోసం పాటు పడినా, మేల్ డామినేషన్ వున్న సమాజం మనది. అందుకే 'స్త్రీ విముక్తి'లు 'స్త్రీ స్వాతంత్ర్యాలు' అంటూ వుద్యమాలు వస్తున్నాయి."

"నువ్వు కూడా అందులో చేరిపో. నన్ను విసిగించకు" అన్నాడు రమేష్ నవ్వుతూ. సునీతకి కోపం వచ్చేస్తోంది.

"అసలు ఈ క్రికెట్ మ్యాచ్‌లు బ్యాన్ చేస్తే బాగుణ్ను" అంది అక్కసుగా.

"అమ్మో! ఎంత మాటన్నావు? సచిన్ టెండూల్కర్ ముందు, సౌరవ్ గంగూలి ముందు అను ఆ మాట."

"లేకపోతే ఏమిటండీ! పోనీ మ్యాచ్ ఒక్కటి చూస్తారా...అంటే వాళ్ళ కాలికి దెబ్బ తగిలితే డాక్టరు వచ్చి స్ప్రే చేసినా, వాళ్ళు దాహం వేసి మంచి నీళ్ళు తెప్పించుకుని తాగినా, దురద వేసి ముక్కు గోక్కున్నా, నవ్వినా, గడ్డిలో కాళ్లు చాపుకుని కూర్చున్నా, ఆటోగ్రాఫ్ మీద సంతకం పెడుతున్నా, బ్యాట్ కావాలని అడిగి మరో బ్యాట్ తెప్పించుకున్నా... ప్రతిదీ కదలకుండా కళ్ళప్పగించి చూస్తారు. అవన్నీ కూడా చూసెయ్యాలా? వాటి బదులు సీరియల్ పెట్టొచ్చుకదా!"

"అబ్బ ఏమిటి సునీతా? మంచి మ్యాచ్ చూడనివ్వకుండా నీ గోలేమిటి? నువ్వు ముందు లోపలికి వెళ్లు" విసుగ్గా అన్నాడు రమేష్.

అప్పటికే కళ్లంట నీళ్ళు తిరిగాయి సునీతకి.

"నన్ను...నన్ను పట్టుకుని వెళ్లు..వెళ్లు అనేస్తారా? అసలు..యింత చదువుకున్న దానిని నన్నే యిలా ట్రీట్ చేస్తున్నారంటే...ఏ చదువు రాని మొద్దు దొరికాల్సింది మీకు..."

"మంచి మాట అన్నావు. ఏ చదువు రాని దానినో చేసుకుంటే నా మాటకి ఎదురు చెప్పేది కాదు. ఇలా ప్రతి మాటకీ వాదించేది కాదు. నోర్మూసుకుని పడి వుండేది."

"అవున్లెండి. పెళ్ళయిన కొత్తలో...నీలాంటి చదువుకున్న దానిని చేసుకోవడం నా అదృష్టం...అంటూ పొగిడేవారు. ఇప్పుడు నన్ను పట్టుకుని..."వుక్రోషం ముంచుకొచ్చింది ఆమెకు.

"ఛ...ఛ...నీకసలు బుద్ధి లేదు. నువ్వే ఆకాశం లోంచి వూడి పడ్డావా? మాటి మాటికీ నన్ను...నాలాంటి దాన్ని...అంటూ ఒకటే గొడవ పెట్టేస్తున్నావు"కోపంగా అన్నాడు రమేష్.

"ఆకాశం లోంచి ఎవరూ వూడి పడరండి. అందరూ అమ్మ కడుపులోంచి వచ్చినవాళ్లే" కళ్లు తుడుచుకుంటూ అంది సునీత.

రమేష్ చురుగ్గా చూశాడు భార్యవైపు.

"అసలు నీ బాధ ఏమిటి? యిలా వచ్చి కూర్చో." చేయి చాచి ఆమెని దగ్గరకు తీసుకుని కూర్చోబెట్టుకున్నాడు.

"నీ కోసం మరొక టీ.వీ కొంటానులే. అప్పుడు హాయిగా నీ తెలుగు సీరియల్స్ అన్నీ చూసుకుంటూ కూర్చో. కొన్నాళ్ళు ఓపికపట్టు. అయినా ఒక్క మాట చెప్తాను విను సునీతా. నువ్వు నన్ను ఎన్ని అన్నా నేను నిన్ను ఎమన్నా మనలో మనం పట్టించుకోకూడదు. ఏమి అనుకున్నా మనిద్దరం ఒకటి. కాదంటావా? చెప్పు."ఆమె జుట్టులోనికి వేళ్ళు పోనిచ్చి ఆప్యాయంగా నిమురుతూ అన్నాడు రమేష్.

సునీత కొంచెం మెత్తబడింది. భర్త కౌగిట్లో కరిగిపోయింది.

తను కూడా కొంచెం సేపు మ్యాచ్ చూసి తర్వాత లోపలికెళ్ళిపోయింది.

✻ ✻ ✻

రమేష్ పేపరు చదువుతున్నాడు.

సునీత అక్కడికి వచ్చింది. "ఏవండీ!"పిల్చింది. రమేష్ పలకలేదు. పేపరు లోంచి తల పైకెత్తలేదు. దీక్షగా పేపరు చదువుతున్నాడు.

"ఏవండీ!" ఈసారి గట్టిగా పిలిచింది సునీత. అయినా రమేష్ పలకలేదు. అసలు ఈ న్యూస్ పేపరు చదువుతున్న వాళ్ళందరికీ యిదొక జబ్బు. నిజంగా వినబడదా? లేక వినబడనట్లు నటిస్తారో తెలీదు! బాగా కోపం వచ్చేసింది సునీతకి.

"ఏవండీ!" ఈసారి బిగ్గరగా అరిచింది. తృళ్ళిపడ్డాడు రమేష్.

"మీకు ఆ పేపరు చేతిలో వున్నంత సేపూ పక్కన బాంబు పడినా వినబడదు. వెధవ పేపరు. వెధవ అలవాట్లు" విసురుగా భర్త చేతిలోని పేపరుని లాగేసి దూరంగా విసిరేసింది సునీత. ఈ సారి కోపం రమేష్‌కొచ్చింది.

"తెల్లవారిందా నీకు. ఇహ ఇప్పట్నుంచి రాత్రి పడుకున్న దాకా ఏదో ఒక దానికి గొడవ లేవదీస్తావు. నాతో యుద్ధం చెయ్యకపోతే నీకు తోచదులావుంది. అలా కొన్నాళ్ళు ఎక్కడికయినా తిరిగి రాకూడదూ! నాకూ మనశ్శాంతిగా వుంటుంది." పేపర్ని తిరిగి తీసుకుని మడత పెడుతూ అన్నాడు రమేష్.

"వెళ్తానులెండి. నేను వెళ్ళిపోతే నిజంగా మీకు మనశ్శాంతి దొరుకుతుందంటే అలాగే వెళ్తాను. మా అన్నయ్యవాళ్ళింటికి వెళ్లిపోతాను. మీరు పదిసార్లు ఫోన్ చేసి రమ్మని పిల్చినా నేను రాను" అంది ఏడుస్తూ.

"పేపరు చదువుతుంటే ప్రళయం వచ్చినా తెలీదు ఈయనకి. మనసు విప్పి ఏం చెప్పుకుందామన్నా వినిపించుకోరు. పైగా అన్నింటికీ ఆ నవ్వు ఒకటి. ఏదీ సీరియస్‌గా తీసుకోరు. కొన్నాళ్ళు పుట్టింటికెళ్తే నేను లేని లోటు తెలిసొస్తుంది ఈయనకి బాగా" కసిగా అనుకుంది వంటింట్లో పని చేసుకుంటూ.

అనుకున్నట్లే మరో నాలుగు రోజులకి సునీత వాళ్ళ అన్నయ్య వాళ్ళింటికి నిజంగానే వెళ్ళింది.

✻ ✻ ✻

సునీత వెళ్ళేసరికి వాళ్ళ అన్నయ్య అత్తగారు, మావగారు, బావమరిది, మరదలు అందరూ వచ్చి వున్నారు వాళ్ళింట్లో.

"ఏమిటి యిలా హఠాత్తుగా వూడిపడ్డావు. బావగారితో ఏమన్నా గొడవ పడ్డావా?" జగన్నాథం చెల్లెల్ని చూస్తూనే.

"ఏం నేను మామూలుగా రాకూడదా? గొడవ పెట్టుకుంటేనే రావాలా?" అంది సునీత లోపలికి వస్తూ.

తను పుట్టి పెరిగిన యిల్లు...ఆ వాతావరణం...అమ్మ, నాన్నా లేకపోయినా తోడబుట్టిన అన్నయ్య వున్నాడు. చిన్నప్పుడు తను, అన్నయ్య కల్సి ఎంత అల్లరి చేసేవాళ్ళు యింట్లో...తన చేతిలో వున్నది లాక్కునేవాడు అన్నయ్య. జుట్టు పట్టుకుని ఈడ్చి కొట్టేసేవాడు. అమ్మతో చెప్తే...ఇవతలకి వచ్చి ఎందుకు చెప్పావంటూ మరి నాలుగు వాయించేవాడు...కాని తర్వాత తను చేసింది తప్పని తెల్సుకుని, తనని మంచి చేసుకోవడానికి ఆ మాటా ఈ మాటా చెప్పి కడుపుబ్బ నవ్వించేవాడు.. చిన్నప్పటి రోజులే వేరు. ఆ ఆత్మీయతలే వేరు...ఆ అనుభూతులే వేరు...ఇప్పుడు ఆత్మీయతకర్థం తెలీదు ఎవరికీ!...

అన్నయ్య, వదిన వెనక వెనకే తిరుగుతూ ఆమెకి అన్ని పన్లలో సాయం చేస్తున్నాడు. ఆ మాటకొస్తే రమేష్ కూడా అన్ని పన్లలో సాయం చేస్తాడు.

కాని అన్నయ్య మునుపటి అన్నయ్య కాడు. అసలు తనని పట్టించుకోవడం మానేశాడు. ఏదో యింటికొచ్చిన దూరపు చుట్టం లాగే చూస్తున్నాడు.


వాళ్ళ అత్తగారికి నడుం నొప్పి వస్తే మాత్రం ఆ రోజు ఆఫీసుకి శలవు పెట్టేసి డాక్టర్ని యింటిక తీసుకువచ్చి చాలా హడావుడి చేసేశాడు.

బావమరిదిని, మరదల్ని కూడా పార్కుకి, రామకృష్ణా బీచ్‌కి తీసుకెళ్ళాడు.

"నేను కూడా వస్తాను అన్నయ్యా" అని అన్లేకపోయింది సునీత.

"నువ్వూ రా చెల్లీ!" అని మాట వరసకయినా అన్నయ్య అనలేదు.

వదిన ఎప్పుడూ వారపత్రికలూ-అందులోని సీరియల్స్ చదువుతూ కూర్చునేది. లేదంటే వాళ్ళ అమ్మ, నాన్నగారితో కబుర్లు చెబుతూ కూర్చునేది. తనొక్కర్తి యింట్లో వుందన్న సంగతే



[illegible] ప్రవర్తించేది.

ఒక రోజు గొంతుక నొప్పితో పాటు బాగా జ్వరం వచ్చేసింది సునీతకి. దుప్పటి కప్పుకు పడుకుంది. ఎవరైనా వచ్చి "ఎందుకలా పడుకున్నావు? వంట్లో బాగా లేదా?" అని పలకరిస్తారేమోనని చూసింది. ఏవరూ రాలేదు. ఎవరూ తనని పట్టించుకోలేదు. ఆఖరికి అన్నయ్య కూడా అత్తమామల సేవలో బావమరిది, మరదళ్ళని ఎంటర్‌టెయిన్ చెయ్యడంలో మునిగిపోయి వున్నాడు. తన దగ్గరకి రాలేదు.

ఏడుపు వచ్చింది సునీతకి. రమేష్ రమ్మని ఫోన్ చెయ్యలేదు. అదొక దుఃఖం.

మనసులోని దుఃఖమంతా కన్నీరు రూపంలో యివతలకి వచ్చేశాక, కళ్ళు తుడుచుకుని యివతలకి వచ్చింది.

"అన్నయ్యా! నాకు జ్వరం వచ్చింది" అంది మూలుగుతూ.

అన్నయ్య 'అయ్యో! జ్వరం వచ్చిందా? ఎప్పట్నుంచి జ్వరం? ఎంత వుంది? హాస్పిటల్‌కి తీసుకెళ్తాను. పద డాక్టరుకి చూపిస్తాను. మీ ఆయన మీద బెంగెట్టుకుని జ్వరం తెచ్చుకున్నావులా వుంది' అని అంటాడనుకుంది. అసలు అలాంటి మాటలే అనలేదు అన్నయ్య.

"పోన్లెద్దు. చిన్న చిన్న జ్వరాలకి పట్టించుకోకూడదు. అసలు నీకెప్పుడూ మూల్గడం అలవాటేగా!" అన్నాడు కొట్టి పారేస్తూ.

మారిపోయాడు అన్నయ్య హఠాత్తుగా మారిపోయాడు. దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది.

అన్నయ్య అలా అన్నాడనే బాధకంటే అందరి ముందూ అలా చులకన చేసినట్టుగా మాట్లాడ్డం చాలా బాధ కలిగించింది ఆమెకి.

తన వెంట తెచ్చుకున్న క్రోసిన్‌లు రెండు వేసుకున్నాక మొత్తానికి ఎలాగో జ్వరం తగ్గింది. ఆయన దగ్గర్నుంచి యిన్ని రోజులైనా ఫోన్ రాలేదు. మరింత దుఃఖంగా వుంది. ఎన్ని ఫోన్లు చేసినా తను రానంది. అసలు ఆయన ఒక ఫోనయినా చెయ్యలేదు. దుఃఖాన్ని, బాధని, గుండెలో దాచి పెట్టి "అన్నయ్యా! నేను వెళ్తాను. ఆయనకి ఇబ్బంది కదా" అంది.

అన్నయ్య ఏమీ అనలేదు. ఆటోలో కూర్చున్నాక 'నేను రమ్మంటే వచ్చావా? వుండమంటే వుండడానికి" అని మాత్రం అన్నాడు.

"ఒక్కసారి 'వుండు' అని చూడు" అని అందామనుకుని నాలుక చివరి దాకా వచ్చి వూరుకుంది. తను తొందరపడి వచ్చేసిందేమో! ఒక్క క్షణం అనిపించింది. హుఁ తను లేని లోటు తెలియాలి అనుకుంది మళ్ళీ.

ఇంత తొందరగా యింటికి వెళ్లడం యిష్టం లేదు ఆమెకి.

"తను ఓడిపోకూడదు. తన విలువేమిటో ఆయనకి తెల్సి రావాలి అని బింకంగా అనుకుంది. విశాఖపట్నం నుంచి విజయనగరం వెళ్లకుండా చోడవరం వచ్చేసింది శారదక్క ఇంటికి.

శారదక్క తనని చూసి ఆశ్చర్యపోయింది. "ఇదేమిటే చెప్పా పెట్టకుండా వచ్చేశావు?" అంది.

శారదక్కకి ఇరవై నాలుగ్గంటలూ బావగారి సేవలు చేసేసరికే సరిపోయేది. అక్కయ్య ధోరణి వింతగా అనిపించి విసుగొచ్చింది సునీతకి.

"ఈ రోజుల్లో కూడా ఆనాటి పతివ్రతల అడుగుజాడల్లో నువ్వు యింకా నడుస్తున్నావంటే నాకు అదోలా వుందక్కా. స్త్రీ సమానత్వం అని అందరూ ఘోషిస్తుంటే నువ్వేమిటి పాత చింత కాయ పచ్చడిలా...ఈ బానిసత్వపు బ్రతుకు బ్రతుకుతున్నావు?" అంటూ వాళ్ళ అక్కని చూసి బోలెడు జాలి కురిపించేసింది సునీత.

"సునీతా! నువ్వు పొరపాటు పడ్తున్నావు. భార్య, భర్తలది పవిత్రమైన బంధం. విడదీయరాని, విడదీయలేని అనుబంధం. భార్య భర్తకి సేవ చేస్తే దాన్ని బానిసత్వం అనుకోవడం చాలా పొరపాటు. అలా సేవలు చెయ్యడం లోనే భార్యకి ఎంతో తృప్తి, ఆనందం కలుగుతాయి. దాన్ని బానిసత్వం అనుకుంటున్నారు నీలాంటివాళ్ళు చాలామంది. తనకింతగా సేవలు చేసే భార్య పట్ల ఏ భర్తకయినా, అభిమానం-ఆప్యాయత కలుగక మానవు. వాళ్ల రుచులకి, అభిరుచులకి మనం విలువనిస్తే మనపట్ల వాళ్ళు కూడా ఎంతో అనురాగంతో ప్రవర్తిస్తారు. ప్రేమ, అభిమానం లాంటివి పరస్పర అవగాహనలోంచే పుట్టుకొస్తాయి. ఈ పద్ధతిని బానిసత్వం అనకూడదు. మనం భర్త అభిప్రాయాల్ని గౌరవిస్తే జీవితాంతం మనకి తోడు-నీడగా, కష్టసుఖాల్లో పాలు పంచుకునే మంచి భాగస్వామిగా అతను కూడా వుంటాడు. దీన్నే నేను సమానత్వం అంటాను. అంతేగాని అర్థం పర్థం లేని విషయాలని తీసుకుని అడ్డంగా వాదించి సంసారంలో అశాంతిని రేకెత్తించడం మూర్ఖత్వం అవుతుంది."

"అక్కా! నువ్వెంత ఎదిగిపోకయావు? నేను ఈ రకంగా ఆలోచించలేకపోయాను సుమా!" అనుకుని మనసులోనే బాధపడింది సునీత. తనకి ముందు నుంచి కోపం, తొందరపాటు ఎక్కువ, తన భర్త నిజంగా మంచి వాడు. తనకి ఒక్కసారిగా కనువిప్పు అయినట్టుగా వుంది ఆమెకి. తన భర్త రమేష్ తాగుబోతు కాదు, తిరుగుబోతు కాదు, సిగరెట్టు, పేకాట లాంటి పాడు అలవాట్లు కూడా లేవు. పైగా తనంటే బోలెడు ప్రేమ, తనే ప్రతి చిన్న విషయానికీ పంతాలు, పట్టింపులకి పోయి అనవసరంగా గొడవలు లేవదీస్తున్నదేమో?! అలాంటి మంచి భర్తని పట్టుకుని వూరికే ఎందుకు ఏడిపిస్తోంది?" అనుకుంది బాధగా.

"నిన్ను చూసి పోదామని వచ్చాను. నేను వెళ్తానక్కా" అంది సునీత సడెన్‌గా.

'నా తొందరపాటుకి క్షమించండి' అనుకుంది ఆటోలో కూర్చుంటూ.

❀

### ప్రొఫెషనల్ స్టార్

బిపాసాబసు మాజీ ప్రియుడు డినో మోరియా మార్కెట్ బాగుండకపోవడంతో రొమేంటిక్ మోడల్ జాన్ అబ్రహామ్‌తో రాసక్రీడలు మొదలు పెట్టింది. ఇంతకీ డినోమోరియాను వదిలి జాన్‌తో ప్రేమలో పడటానికి అసలు కారణం బిపాసాకు జాన్ అబ్రహం ఒక ఫ్లాట్ కొని ఇచ్చాడట. దీనితో బిపాసా జాన్ కౌగిలిలో ఒదిగిపోయింది. అయితే ఇంకెవరైనా బిల్డింగ్ కొని ఇవ్వగలిగే బిపాసా వారిదే అన్నమాట. ఎంతైనా ప్రొఫెషనల్ స్టార్ కదా.

